శనగ రైతు దిగాలు

- అనుకూలించని వాతావరణ పరిస్థితులు
- తగ్గిన దిగుబడి .. మార్కెట్‌లో ధర అంతంతమాత్రమే
- ఊరటనిస్తున్న ప్రభుత్వ గిట్టుబాటు ధర
- ఫిబ్రవరిలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు చర్యలు

మిడుతూరు: ఆరుకాలం శ్రమించిన రైతన్నలకు శనగ సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో దిగాలు చెందుతున్నాడు. ఈ ఏడాది రబీ సీజన్‌లో మండలంలోని అన్ని గ్రామాలలో శనగ విస్తీర్ణం బాగా పెరిగింది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో దిగుబడులపై ప్రభావం పడింది. దీనికి తోడు మార్కెట్‌లో కూడా ఆశించినమేర ధర లేకపోవడంతో శనగరైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రైతులకు ఊరటనిస్తుండటంతో అన్నదాతలు విక్రయ కేంద్రాల్లో అమ్ముకునేందుకు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ గిట్టుబాటు ధర రూ.5,230

నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు మండలంలో ఈ ఏడాది 3,406 హెక్టార్లలో శనగ సాగు చేశారు. మిడుతూరులో 2,159 హెక్టార్లు, జూపాడుబంగ్లా 2,159, పాములపాడు 412 , పగిడ్యాల 385 , కొత్తపల్లి 278 హెక్టార్ల విస్తీర్ణంలో పంట వేశారు. అయితే ఈ ఏడాది 4 క్వింటాళ్ల నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. గతంలో ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు వచ్చేది. అలాగే ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.4,600 ఉండగా ప్రభుత్వం గిట్టుబాటు ధర రూ.5,230గా ప్రకటించింది. గతేడాది కూడా దాదాపు ఇదేధర పలికింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఫిబ్రవరిలో ప్రారంభించే అవకాశం ఉండటంతో కొందరు దళారులు రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకే కొనుగోళ్లు చేస్తున్నారు.



శనగ పంటను నూర్పిడి యంత్రంలో వేస్తున్న దృశ్యం



శనగలను సంచులలో నింపుతున్న కూలీలు

ఎకరాకు రూ.16వేల వరకు ఖర్చు

ఎకరాకు రైతుకు సాగు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.16 వేలు పెట్టిబడి కింద ఖర్చులు వస్తున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడం, అకాల వర్షాలు, మొగలికి తోడు చీడపీడలు ఆశించడంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో పాటు దిగుబడి తగ్గిపోతుండటంతో రైతులు కుదేలైన పరిస్థితి నెలకొంది. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎకరాకు కౌలు రూ .12,000 నుంచి రూ 16, 000 వరకు అదనంగా చెల్లిచాల్సి వస్తోంది. దీంతో నష్టాలు మిగిలే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా కొనుగోలు చేయాలి



ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో శనగ క్వింటా ధర రూ. 4,700 ఉంది. ప్రభుత్వం మద్దతు ధర ఈ ఏడాది రూ.5,300 ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారుల చేతిలో రైతులు దగా అవుతున్నారు. త్వరగా కొనుగోలు చేయాలి

– రాజేశ్వరరెడ్డి, రైతు, పీరుసాహెబ్‌పేట

వాతావరణం అనుకూలించలేదు



శనగ సాగు సమయంలో వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులపైన ప్రభావం చూపింది. ఈ ఏడాది పంటపూత దశలో పొగ మంచు, తుపాను ప్రభావం తదితర కారణల వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. రైతులకు ఖర్చులు పెరిగి వ్యవసాయం భారంగా మారింది.

– శేషిరెడ్డి , రైతు చింతలపల్లి

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ఫిబ్రవరి నెలలో శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వం క్వింటాకు రూ. 5,230తో కొనుగోలు చేస్తుంది. రైతులు ఈలోగా దళారుల మాటలు నమ్మి దిగుబడులు విక్రయించి నష్టపోవద్దు.

– పీరునాయక్ , మండల వ్యవసాయ అధికారి, మిడుతూరు

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

వెలుగోడు: ఈ నెల 30వ తేదీ నుంచి పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్ తెలిపారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు ద్వారక నగర్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మకూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఫిబ్రవరి 3వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి హాజరవుతారని చెప్పారు.

జలకనూరులో..

మిడుతూరు: మండల పరిధిలోని జలకనూరు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరై ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు కుటుంబానికి 4 నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు వేల్పుల ఆనంద్‌బాబు పంపించారు. ఆదివారం మండలంలోని బీసీ, ఎస్సీ, మైనార్టీ సంఘాల నాయకులు ఆ సరుకులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 4 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితమయ్యాడు. స్థానిక ప్రజా సంఘాల నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఆనంద్‌బాబు సరుకులను పంపాడని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మణిరాజు, సంజీవరాయుడు, వేణు, శంకర్‌గౌడు, మీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

చెంచుగూడేల్లో ఉచిత వైద్యశిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం, పాతమాడుగుల చెంచు గూడేల్లో సంఘమిత్ర సంచార వైద్యశాల, ఐఎంఏ మహిళా విభాగం డాక్టర్లు ఆదివారం ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో రక్త హీనత ఉన్న గర్భిణులకు, చర్మ వ్యాధులు కల వారికి, చిన్నారులకు దాదాపు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో నంద్యాలకు చెందిన డాక్టర్లు సత్యశివ సుందరి, నర్మద, హరిత, మాధవి, రాధిక, దయ, శంకర్, సంఘమిత్ర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

3న విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠకోసం సిద్ధంగా ఉంచిన విగ్రహం

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామ సమీపంలోని శ్రీశంకరమల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఫిబ్రవరి 3న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2 తేదీలలో గణపతిపూజ, పుణ్యాహవచనము, యాగశాల ప్రవేశం, పంచగవ్యప్రాశన, సర్వదేవతా ఆవాహనం, యంత్రపూజ తదితర పూజాధికార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న ఉదయం 9.41 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇకపై ఆలయ ఆవరణలో సర్వదోషనివారణ పూజలు, అపమృత్యుదోష నివారణ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెలుగోడు: నంద్యాల జిల్లా రుటా నాయకుడు టీచర్ ఇబ్రహీం ఖలీల్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా రియసతి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా)– 2023 స్టిక్కర్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మంనాయక్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రూటా నాయకులు అతావుర్ రహమాన్, అహ్మద్ హుస్సేన్, జాకీర్, జుబేర్, అస్లం తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు దుప్పట్ల పంపిణీ



చెంచులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ

జూపాడుబంగ్లా: కొత్తసిద్దేశ్వరం గ్రామానికి చెందిన చెంచులకు దుప్పట్లు పంపిణీ చేసి అనంతపురం జిల్లా నల్లచెరువు ఎస్‌ఐ నాయిని వరలక్ష్మి మానవత్వం చాటుకున్నారు. పాములపాడు మండలం జూటూరు గ్రామానికి చెందిన ఆమె ఆదివారం కుటుంబ సభ్యులతో కొత్తసిద్దేశ్వరం గ్రామానికి చేరుకొన్నారు. అక్కడ చలితీవ్రతతో ఇబ్బందులకు గురవుతున్న చెంచులకు దుప్పట్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జయచంద్ర, నాయిని రామ స్వామి, లక్ష్మిదేవి, నాయిని శరత్‌చంద్ర పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారి గర్భగుడిని అలంకరించిన దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నంద్యాలకు చెందిన జమ్ములమడుగు నాగరాజు అనే భక్తుడు సుమారు రూ.40వేలు వెచ్చించి వివిధ రకాల పూలతో గర్భగుడిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీర సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.

రామసముద్రానికి రోడ్డు నిర్మించాలి

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల మజరా గ్రామమైన రామసముద్రం గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు స్వాములు కోరారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి ఇంత వరకు ఎలాంటి రోడ్డు లేకపోవటంతో గుంతలమయమైన రహదారిలోనే ప్రజలు ప్రయాణిస్తూ నరకయాతన పడుతున్నారన్నారు. గ్రామానికి రోడ్డు మార్గం లేకపోవటంతో ఆర్టీసి బస్సులు, ప్రైవేటు వాహనాలు తిప్పటం లేదన్నారు. దీంతో చెందిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలన్నా ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకొని రామసముద్రం గ్రామానికి రోడ్డును నిర్మిచాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగయ్య, పెద్దచెంచయ్య, లచ్చమ్మ, దర్గయ్య, శివ, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'సమరసత' సేవలు అభినందనీయం



దుస్తులు పంపిణీ చేస్తున్న యోగేంద్రస్వామి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో సమరసత సేవా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కాకనూరు సరస్వతి పీఠాధిపతి శ్రీ శివ యోగేంద్ర సరస్వతి స్వామి అన్నారు. ఆదివారం శివ భక్తులకు శివ మాలాధారణ దుస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ సభ్యులు గత కొన్ని సంవత్సరాల నుండి భవానీ, శివా, అయ్యప్పస్వామి, లక్ష్మినరసింహా దీక్షా భక్తులకు అవసరమైన వారికి ఉచితంగా దీక్షా దుస్తులు, అదే విధంగా వైద్య, విద్యలో పేద వారికి తమవంతు సాయం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ చింతలపల్లె వాసు, వేణుగోపాల్, తదితర భక్తులు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులు పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లన్న సేవలో పెనుగొండ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే శంకర్‌నారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను పెనుగొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు ఉపాధి పనులపై బహిరంగ చర్చ

మిడుతూరు: 2021 ఏప్రిల్ 01 నుంచి 2022 మార్చి 31 వరకు మిడుతూరు మండలంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ పూర్తయ్యిందని, ఈనె 31న కార్యాలయ ఆవరణలో బహిరంగ చర్చ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, ఏపీఓ జయంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌కార్డు, వర్క్ ఐడీ వారీగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు లబ్ధిదారులను విచారించడంతో పాటు కొలతలు, సమగ్ర వివరాలపై మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బహిరంగ చర్చకు గ్రామ సర్పంచ్‌లు , మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అన్నదాన కార్యక్రమానికి ఆహ్వానం



శిల్పా భువనేశ్వరరెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వెంకటాపురం గ్రామంలో ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హాజరు కావాలని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థాన కమిటీ నిర్వాహకులు వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డిని ఆహ్వానించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం ఆహ్వానపత్రాన్ని ఆయనకు అందజేశారు.

వాల్మీకులు వినతులు సమర్పించండి



మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించేందుకు గల అవకాశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం నియమించిన శామ్యూల్ ఆనంద్ కుమార్ డోన్, కర్నూలులో పర్యటించనున్నారని, వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు వినతులు ఇవ్వాలని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులికొండన్న పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో వీఆర్‌పీఎస్ నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవాలంటే వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించటమే ఉత్తమ మార్గమని శామ్యూల్ ఆనంద్ కుమార్‌కు వినతుల ద్వారా తెలపాలన్నారు. సోమవారం నంద్యాల జిల్లాలోని డోన్ ఆర్‌డీఓ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అదే రోజు కర్నూలు జెడ్పీ కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు వినతులు స్వీకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, స్వామినాయుడు, మధుగోపాల్, రామనాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలీ రేట్ల పెంపుపై హర్షం

నంద్యాల(అర్బన్): సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల కూలీ రేట్ల పెంపుదలకు సంబంధించి జీఓ నెం.3 విడుదల చేయడంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక గోడౌన్ ఆవరణలో హమాలీలకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. తోటమద్దులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కూలీ రేట్లు పెంచి హమాలీల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, దస్తగిరి, రమేష్, కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

నంద్యాల(అర్బన్): నంద్యాల మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పోలూరు మహేశ్వరరెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. మూడేళ్ల క్రితం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఉన్న ఇసాక్‌బాషా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న లక్ష్మయ్య ఇన్‌చార్జి చైర్మన్‌గా విధులు నిర్వహిస్తూ వచ్చారు. పూర్తిస్థాయి చైర్మన్‌గా పోలూరు మహేశ్వరరెడ్డిని ఎంపిక చేస్తూ ఇటీవల ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. కార్యక్రమానికి ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు యార్డు అధికారులు తెలిపారు.

నేడు ఎస్పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

బొమ్మలసత్రం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో పాల్గొనే వారు హెల్మెట్ ధరించి ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వద్దకు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హాజరవుతారని వివరించారు.

లింగాలగట్టును సందర్శించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలోని బోయ, వాల్మికుల స్థితిగతులపై అధ్యయనం చేస్తున్న వన్‌మ్యాన్ కమిషన్ శామ్యూల్ ఆనంద్ కుమార్ శ్రీశైలం మండలంలోని లింగాలగట్టును సందర్శించాలని వాల్మికి బోయ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి నల్లబోతుల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లింగాలగట్టు గ్రామంలో 500 బోయ, వాల్మిక కుటుంబాలు ఉన్నాయన్నారు. చేపలవేట, కూలి పనులు , భిక్షులపై ఆధారపడి వీరు జీవనం సాగిస్తున్నారని, కమిషన్ ఈ కుటుంబాల స్థితిగతులపై అధ్యయనం చేసి వారికి జీవన ఉపాధులు కల్పించాలని కోరారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అ'పూర్వ' కలయిక

మహానంది: మహానంది మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయసమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 2010- 2011 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ ఒకే చోట కలిసి వారి గురువులను ఘనంగా సన్మానించారు.12 ఏళ్ల తర్వాత అందరు కలిసి అనుభూతులు, అనుభవాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ వెంకటరమణ, ఉపాధ్యాయులు నాగేశ్వర్ రెడ్డి, సుబ్బరాయుడు, నీలకంఠమాచారి, నాగేశు పాల్గొన్నారు.

తొగటవీర క్షత్రియులు అన్ని రంగాల్లో రాణించాలి



వీరక్షత్రియ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయప్రసాదును సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

జూపాడుబంగ్లా: తొగట వీరక్షత్రియులు విద్యా, రాజకీయ రంగాల్లో రాణించాలని వీరక్షత్రియ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయప్రసాదు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభాస్కర్ తెలిపారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని శ్రీచౌడేశ్వరి ఆలయం వద్ద వీరక్షత్రియుల నంద్యాల జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కొప్పల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, కార్యనిర్వాహణాధికారి పల్ల రామాంజి, కమిటీ సభ్యులుగా రామచంద్ర, వెంకటరమణ, రాజశేఖర్, చింత సత్యనారాయణ, కలిశెట్టి వెంకటరమణ, చింత రమణ, జీఆర్ వేణుగోపాల్ లను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయప్రసాదును నూతన కమిటీ సభ్యులు సన్మానించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ప్రచారం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆత్మకూరు: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఏపీటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి డాక్టర్ శ్యామల అనీల్ వెంకటప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హృదయరాజు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల, విద్యా వ్యవస్థ పట్ల అవగాహన ఉండి, పోరాట పటిమ కలిగిన వ్యక్తి శ్యామల అనీల్‌వెంకటప్రసాద్‌రెడ్డి అని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కర్నూలు, నంద్యాల జిల్లాల నాయకులు సాంబశివుడు, మరియానందం, శంకర్, లింగమయ్య, ఉమర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణతోనే భావితరాల మనుగడ



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): ప్లాస్టిక్ నియంత్రణతోనే భావితరాల మనుగడ సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి మనల్ని మనం కాపాడుకోవాలన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో వస్త్ర దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని పట్టణం నుంచి తరిమేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణంలోని ప్రతి వస్త్ర దుకాణాల్లో ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన నోటీసులను ఉంచి, ప్రజలను చైతన్య పరచలని కోరారు. అలాగే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులు జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాసు, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కురువలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గోస్పాడు: కురువ కులస్తులందరూ ఐకమత్యంతో ఉంటూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని కురువ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి శంకర్, అసోసియేట్ అధ్యక్షుడు శివన్న అన్నారు. గోస్పాడు మండలంలోని యాళ్లూరు గ్రామంలో ఆదివారం సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కురవ కులస్తులందరూ ఐకమత్యంతో ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. పార్టీలకు అతీతంగా అందరితో కలిసి ఉంటూ మన ఉనికిని చాటుకునేలా రాజకీయంగా రాణించాలని, పెత్తందారుల చేతుల్లో మగ్గారాదని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, సంఘం నాయకులు లింగమయ్య, బాల ఉసేని, నరసింహులు, శ్రీనివాసులు వెంకటేశ్వర్లు, సాంబశివుడు, బాలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సహకార సంఘ ఉద్యోగులందరికీ పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని సహకార సంఘం నంద్యాల జిల్లా మహాసభ యూనియన్ అధ్యక్షుడు వీరభద్రుడు కోరారు. నంద్యాల రిటైల్ జనరల్ మర్చెంట్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం సహకార సంఘం నంద్యాల జిల్లా మహాసభ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఓ నెం.36 అమలుకు తక్షణ చర్యలు తీసుకొని జీత భత్యాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారిగా భాస్కర్, పాలక వర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా కోశాధికారి భాస్కర్, రిటైర్డు ఏజీఎం భాస్కరరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి వెంకటరామయ్య పాల్గొన్నారు.

కరువు భత్యం చెల్లించాలి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన కరువు భత్యాన్ని వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రెండు విడతల కరువు భత్యాన్ని, ఆర్జిత సెలవుల మొత్తాన్ని వెంటనే జమ చేయాలన్నారు. తెలుగు, హిందీ కౌన్సెలింగ్ పూర్తయిన వారికి వెంటనే జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని కోరారు. నాయకులు విజయరావు, కృష్ణారావు, భాస్కరరెడి పాల్గొన్నారు.

దోమలు బాబోయ్ !



దోమల బెడదతో ఓ దుకాణం వద్ద పొగపెట్టిన దృశ్యం

మహానంది: అమ్మో...ఇవెక్కడి దోమలండి బాబోయ్...ఇన్నేసి ఉన్నాయ్... అయ్యో నిలబడలేం ఇక్కడ పద పద ఓ కాయిల్ కొని రూముకెళదాం.. అన్నం చూసి తిను లేదంటే దోమలు పడిపోతాయ్ బాబూ... ఇదీ మహానందిలో భక్తుల పరిస్థితి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో చీకటి పడితే చాలు దోమలు చుట్టుకుంటున్నాయి. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు బయట నిలబడాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. దర్శనం అనంతరం బయటికి వచ్చిన భక్తులు హోటళ్ల వద్ద కాసేపు కూర్చుని టీ, కాఫీ తాగలేని దుస్థితి. అధికారులు స్పందించి నిత్యం ఫాగింగ్ చేయించాలని భక్తులతో పాటు స్థానికులు కోరుతున్నారు.